సాక్షి
నిజామాబాద్
శుక్రవారం । 28 । ఫిబ్రవరి । 2025


నగరంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఓటు వేసేందుకు బారులు తీరిన పట్టభద్రులు

గరిష్టం/కనిష్టం
39.0 /17.0

వాతావరణం
ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చలి తీవ్రత తక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సుభాష్‌నగర్: నగరంలోని 33/11 కేవీ తిలక్‌గార్డెన్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని టౌన్–2 ఏడీఈ ఆర్ ప్రసాద్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లోని 8 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో కొత్తగా 12.5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

మార్చి 1న బైక్ సైక్లింగ్ జిల్లా జట్ల ఎంపికలు

నిజామాబాద్‌నాగారం: నగరంలోని కంఠేశ్వర్ బైపాస్ రోడ్‌లో మార్చి 1న మౌంటెన్ బైక్ సైక్లింగ్ పోటీలకు జిల్లాస్థాయి జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు నిజామాబాద్ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ కార్యదర్శి విజయ్‌కాంత్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 7 నుంచి 9వరకు హైదరాబాద్‌లో జరుగనున్న 9వ రాష్ట్రస్థాయి మౌంటెన్ బైక్‌సైక్లింగ్ పోటీలకు జిల్లా జట్లను ఎంపిక చేయడానికి ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలు అండర్ 14, 16 ,18 బాలురు, బాలికలు, పురుషులు, మహిళలు విభాగంలో చేపడతామన్నారు. ఆసక్తి ఉన్న వారు సంబంధిత ధ్రువపత్రాలతో ఉదయం ఏడు గంటలకు రిపోర్టు చేయాలన్నారు. మరిన్ని వివరాలకు 99128 83331ను సంప్రదించాలన్నారు.

తూం తలుపులు తెరిచేదెట్లా?



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి నీటి సరాఫరా చేసే ప్రధాన కాలువకే కాదు.. ఉప కాలువలకు కూడా తూం తలుపులు ఎత్తడానికి లష్కరులకు తిప్పలు తప్పడం లేదు. తూం తలుపులు ఎత్తడానికి ఎలక్ట్రానిక్ విధానం ఏర్పాటు చేసినా పనిచేయక పోవడంతో తలుపులు పైకి రావడం లేదు. దీంతో లష్కర్లు నిత్యం చేతులతో తిప్పుతూ తలుపులను ఎత్తుతున్నారు. గురువారం ముప్కాల్ మండలం కొత్తపల్లి శివారులో లక్ష్మి కాలువ డీ–4 తలుపులు ఎత్తడానికి లష్కరులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చివరికి తలుపులను ఎత్తి దిగువకు నీటిని వదిలారు.

ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతం

ముబారక్‌నగర్‌లోని పోలింగ్ సెంటర్‌లో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ఓటర్లు



పోలింగ్ సరళి ఇలా..

పోలింగ్ సమయం	ఓటేసిన పట్టభద్రులు	శాతం	ఓటేసిన టీచర్లు	శాతం
ఉదయం 8 నుంచి 10 గంటల వరకు	3,011	9.5	599	15.97
మధ్యాహ్నం 12 వరకు	8,665	27.44	1,580	42.12
మధ్యాహ్నం 2 వరకు	15,766	49.93	2,484	66.22
సాయంత్రం 4 వరకు	24,388	77.24	3,468	92.46

ఉపాధ్యాయులదే పైచేయి

నిజామాబాద్‌అర్బన్: ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ శాతంలో పట్టభద్రుల కన్నా ఉపాధ్యాయులదే అధికంగా నమోదైంది. జిల్లా వ్యాప్తంగా మూడు డివిజన్లలో పట్టభద్రుల పోలింగ్ 77.24 శాతం నమోదుకాగా, ఉపాధ్యాయులు 92.46 శాతం మంది ఓట్లు వేశారు. పట్టభద్రుల ఓటింగ్‌లో పురుషులు 15,663 మంది, మహిళలు 8,725 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఉపాధ్యాయుల్లో పురుషులు 2135 మంది, మహిళలు 1333 మంది ఓటేశారు. జిల్లాలో మొత్తం పట్టభద్ర ఓటర్లు 31,574 మంది ఉండగా 24,388 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి జిల్లాలో 3,751 మంది ఓటర్లు ఉండగా 3,468 మంది ఓటు వేశారు.

- ఓటేసిన పట్టభద్రులు 24,388.. ఓటింగ్ శాతం 77.24 నమోదు
- టీచర్ల ఎమ్మెల్సీకి పోలైన ఓట్లు 3,468.. ఓటింగ్ శాతం 92.46 నమోదు
- సౌకర్యాల కరువుతో ఇబ్బందిపడ్డ వృద్ధులు, దివ్యాంగులు
- ఓటు హక్కు వినియోగించుకున్న కలెక్టర్

రెవెన్యూ డివిజన్‌ల వారీగా పోలింగ్ వివరాలు

పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్				ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్			
రెవెన్యూ డివిజన్	మొత్తం ఓటర్లు	పోలైన ఓట్లు	శాతం	రెవెన్యూ డివిజన్	మొత్తం ఓటర్లు	పోలైన ఓట్లు	శాతం
నిజామాబాద్	14341	10779	75.16	నిజామాబాద్	2001	1818	90.85
బోధన్	5037	4106	81.52	బోధన్	701	660	94.15
ఆర్మూర్	12196	9503	77.92	ఆర్మూర్	1049	990	94.38
మొత్తం	31,574	24,388	77.24	మొత్తం	3751	3468	92.46

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్ జిల్లాల పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జిల్లాలోని 48 పోలింగ్ కేంద్రాల్లో పట్టభద్రులు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. జిల్లాలో మొత్తం పట్టభద్రుల ఓట్లు 31,574 ఉండగా 24,388 మంది ఓటేశారు. ఉపాధ్యాయ ఓటర్లు మొత్తం 3,751 మంది ఉండగా 3,468 మంది ఓట్లేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు 33 కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు జిల్లా కేంద్రంలోని ఎస్ఎఫ్ఎస్ స్కూల్‌లో ఓటుహక్కును వినియోగించుకున్నారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ముబారక్‌నగర్ పోలింగ్ బూత్ వద్ద బీజేపీ జిల్లా అధ్యక్షుడు కులాచారి దినేశ్ కాషాయ కండువా వేసుకోవడంపై పోలీసులు అభ్యంతరం తెలిపారు. ఈ విషయమై స్వల్ప వాగ్వాదం చోటుచేసుకుంది. నిర్మల హృదయ పాఠశాలతోపాటు ముబారక్‌నగర్‌లోని పోలింగ్ కేంద్రంలో వీల్‌చైర్లు లేకపోవడంతో దివ్యాంగులు ఇబ్బందిపడ్డారు. పాలిటెక్నిక్ కళాశాల పోలింగ్ కేంద్రంలో చిన్నబాబును ఎత్తుకొని ఓటేసేందుకు వచ్చిన ఓ మహిళను పోలీసులు అడ్డుకోవడంతో ఆమె ఓటు వేయకుండానే వెనుదిరిగింది.


ఎస్ఎఫ్ఎస్‌లో ఓటు వేస్తున్న కలెక్టర్

ఆరు సెంటర్లలో వంద శాతం పోలింగ్

నిజామాబాద్‌అర్బన్ : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి జిల్లాలోని ఆరు పోలింగ్ కేంద్రాల్లో వంద శాతం ఓటింగ్ నమోదైంది. సిరికొండ పోలింగ్ కేంద్రంలో మొత్తం 25మంది, రెంజల్‌లో 13మంది, చందూర్‌లో 17మంది, పోతంగల్‌లో 12మంది, రుద్రూరు పోలింగ్ కేంద్రంలో 49మంది, బాల్కొండ పోలింగ్ కేంద్రంలో 28 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. డిచ్‌పల్లి సెంటర్‌లో 97.56 శాతం ఓటింగ్ నమోదైంది. అతి తక్కువగా మోస్రా పోలింగ్ కేంద్రంలో 75 శాతం పోలింగ్ నమోదైంది.

కరీంనగర్‌కు బ్యాలెట్ బాక్సులు



నిజామాబాద్‌అర్బన్ : ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్సులను అధికారులు బందోబస్తు మధ్య కరీంనగర్‌కు తరలించారు. ఆయా పోలింగ్ కేంద్రాల నుంచి సాయంత్రం 4 గంటల తరువాత ఆర్టీసీ బస్సుల్లో బ్యాలెట్ బాక్సులను తీసుకెళ్లారు. కరీంనగర్‌లోని రిసెప్షన్ సెంటర్లలో అప్పగించనున్నారు.

వృద్ధులు, దివ్యాంగులకు ఇబ్బందులు

నిజామాబాద్ సిటీ : నగరంలోని పలు పోలింగ్ కేంద్రాల వద్ద వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బందులకు గురయ్యారు. నిర్మల హృదయ్ పాఠశాల పోలింగ్ కేంద్రం వద్ద వీల్‌చైర్లు సిద్ధంగా ఉంచకపోవడంతో కొందరు దివ్యాంగులను బైక్‌లపై తీసుకొచ్చారు. ఈ విషయమై పోలీసులను వివరణ అడగగా 'తమకేం తెలియదు. ఎన్నికల అధికారులు వీల్‌చైర్లు ఏర్పాటు చేయలేదు' అని తెలిపారు. ఇదిలా ఉండగా పోలింగ్ కేంద్రం వద్ద గంటల కొద్దీ క్యూలో నిలబడ్డ ఓటర్లు అసహనానికి గురయ్యారు.

షార్ట్ వేసుకుని రావడంతో..

జిల్లా కేంద్రంలోని వర్ని ప్రాంతానికి చెందిన సాయి అనే యువకుడు ఓటు వేసేందుకు నిర్మల హృదయ పాఠశాల పోలింగ్ కేంద్రానికి వచ్చాడు. అతను షార్ట్ వేసుకొని రావడంతో ఓటేసేందుకు వీలు లేదని పోలీసులు అడ్డుకున్నారు. ఓటు వేసేందుకు డ్రెస్‌కోడ్ ఉంటుందా? అని వాదించినా పోలీసులు వినిపించుకోలేదు. అసహనంతో ఓటు వేయకుండా వెనుదిరిగి వెళుతుండగా అడిషనల్ డీసీపీ బస్వారెడ్డి అక్కడికి వచ్చారు. మీడియా ప్రతినిధులు డ్రెస్‌కోడ్ విషయాన్ని డీసీపీ దృష్టికి తీసుకెళ్లడంతో చివరకు ఆ యువకుడికి ఓటు వేసేందుకు అనుమతించారు. దీంతో ఆ యువకుడు మీడియాకు కృతజ్ఞతలు తెలిపారు.


షార్ట్ వేసుకువచ్చిన వ్యక్తిని అడ్డుకుంటున్న పోలీసు



ఎస్ఎఫ్ఎస్‌లో ఓటువేసిన తండ్రీకూతుళ్లు


ఓటరుకు సహాయపడుతున్న పోలీసు

బొంతలే.. తలుపులు

బాల్కొండ: ముప్కాల్ కేజీబీవీ పాఠశాలలో మరుగుదొడ్లు, మూత్రశాలల ప్రధాన ద్వారాలకు అతుకుల బొంతలనే అడ్డుగా పెట్టుకోవాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో విద్యార్థినులు చెప్పుకోలేని బాధలు పడుతున్నారు. నూతన భవనం పనులు కొనసాగుతుండటంతో ప్రస్తుతం అద్దె భవనంలోనే పాఠశాలను నెట్టుకువస్తున్నారు. కనీస సౌకర్యాలు లేక విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి భవన నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. మరుగుదొడ్లు, మూత్రశాలలకు మరమ్మతులు చేయించాలని పేర్కొంటున్నారు.


ముప్కాల్ కేజీబీవీలోని బాత్‌రూం తలుపునకు కట్టిన బొంతలు

యూరియా కోసం..


బాల్కొండ సొసైటీ వద్ద క్యూలో నిలబడిన రైతులు

కొంత కాలంగా యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గురువారం బాల్కొండ మండల సహకార సంఘానికి యూరియా రావడంతో రైతులు బారులు తీరారు. దీంతో ప్రతి రైతుకు రెండు బస్తాల యూరియాను సిబ్బంది అందజేశారు. అయినా కొంతమంది రైతులకు యూరియా అందకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం వరి పొట్ట దశలో ఉండడంతో యూరియా అవసరం ఎక్కువగా ఉందన్నారు. యూరియా కొరత లేకుండా ప్రభుత్వం సరఫరా చేయాలని రైతులు డిమాండ్ చేశారు. బాల్కొండ

కొత్త కోర్సులుంటేనే అనుమతి

డిగ్రీలో సమూల మార్పులు?
- ప్రాజెక్టు వర్క్ ఉండేలా కొత్త సిలబస్
- ఈ ఏడాది పలు కళాశాలలకు అనుమతి కష్టమే..
- కనుమరుగు కానున్న దోస్త్..!

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో గత నాలుగు సంవత్సరాల డిగ్రీ ప్రవేశాల వివరాలు

విద్యా సంవత్సరం	అందుబాటులో సీట్లు	డిగ్రీలో చేరిన విద్యార్థులు	మిగిలిన సీట్లు
2021-22	34,370	17,960	16,410
2022-23	26,980	14,564	12,416
2023-24	33,630	14,046	19,584
2024-25	33,830	12,764	21,764



తెయూ(డిచ్‌పల్లి): డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాల ప్రక్రియ ఈ ఏడాది సమగ్రంగా మారబోతోంది. 'డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్, తెలంగాణ (దోస్త్)' తెరమరుగు కానుంది. దాని స్థానంలో పాత పద్ధతిలోనే కాలేజీలు సొంతంగా అడ్మిషన్లు చేపట్టబోతున్నాయి. ఇందుకు సంబంధించి రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కసరత్తు పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదిక అందజేసినట్లు సమాచారం. ప్రభుత్వ అనుమతి లభించిన వెంటనే డిగ్రీ ప్రవేశాల విధి విధానాలను ఖరారు చేయనున్నారు. అయితే కోర్సుల ఏర్పాటు, అనుమతులు విద్యామండలి అధీనంలోనే ఉంటాయని, ఏయే కోర్సులకు, ఏయే కాలేజీలకు అనుమతించాలనేది మండలి నిర్ణయిస్తుందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో సుమారు 15 డిగ్రీ కాలేజీలకు అనుమతి రద్దయ్యే అవకాశాలున్నాయి. కొత్త విధి విధానాలు వచ్చిన తర్వాత అందుకు తగిన విధంగా కోర్సులు ఉంటే తప్ప కాలేజీలకు అనుమతి లభించడం కష్టమని అధికారులు పేర్కొంటున్నారు.

డిగ్రీ సీట్లకు కోత

తెయూ పరిధిలో ప్రస్తుతం 74 డిగ్రీ కాలేజీలు ఉన్నాయి. అందులో 13 ప్రభుత్వ, 54 ప్రైవేటు, ఎయిడెడ్, రెసిడెన్షియల్ (గురుకులాలు) డిగ్రీ కాలేజీల్లో కలిపి సుమారు 34,500 సీట్లు ఉన్నాయి. అయితే కొన్నేళ్లుగా డిగ్రీ ప్రవేశాలు 40 నుంచి 50 శాతానికి మించడం లేదు. ముఖ్యంగా ప్రైవేట్ డిగ్రీ కాలేజీల్లో 30 శాతం మాత్రమే సీట్లు భర్తీ అవుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని కాలేజీల్లో అయితే ఇది 25 శాతమే. నిజానికి ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఇంటర్ ఉత్తీర్ణత సాధించిన వారంతా డిగ్రీలో చేరినా ఇంకా సీట్లు మిగిలిపోయే పరిస్థితి. ఇలా విద్యార్థులు తక్కువ, సీట్లు ఎక్కువ ఉండటంపై ఉన్నత విద్యా మండలి ప్రత్యేక దృష్టి సారించింది. రాష్ట్రంలోని డిగ్రీకాలేజీల్లో భర్తీ అవుతున్న సీట్లలో సగానికిపైగా సీట్లు కొత్త కోర్సులకు సంబంధించినవే ఉంటున్నాయి. బీకాం ఫైనాన్స్, కంప్యూటర్స్ వంటి కాంబినేషన్ సబ్జెక్టులకు డిమాండ్ ఉంది. ఆ తర్వాత స్థానంలో బీఎస్సీ కంప్యూటర్స్, లైఫ్‌సైన్స్ కోర్సులకు ప్రాధాన్యమిస్తున్నారు. కానీ ఈ కోర్సులు అన్ని కాలేజీలలో లేవు. అధిక సంఖ్యలోని కాలేజీల్లో ఇప్పటికీ సాధారణ డిగ్రీ కోర్సులే ఉన్నాయి. కాంబినేషన్ కోర్సులు ఎక్కువ భాగం హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని కాలేజీల్లోనే ఉంటున్నాయి. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని యూజీసీ, ఉన్నత విద్యా మండలి డిజైన్ చేసిన కోర్సులను అందుబాటులోకి తెచ్చిన కాలేజీలకే అనుమతివ్వాలని నిర్ణయించినట్లు తెలిసింది. దీంతో తెయూ పరిధిలో సైతం దాదాపు 16 వేల సీట్లు తగ్గిపోయే అవకాశాలున్నట్లు వర్సిటీ వర్గాలు తెలిపాయి.

కొత్త సిలబస్ అందుబాటులోకి..

ఉన్నత విద్యామండలి 2025–26 విద్యా సంవత్సరం నుంచి డిగ్రీలో కొత్త సిలబస్‌ను ప్రవేశపెట్టేందుకు సన్నాహాలు చేస్తోంది. సాధారణ డిగ్రీలో కంప్యూటర్ కోర్సులు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్ వంటి సబ్జెక్టులను అందుబాటులోకి తేనుంది. ఈ దిశగా నిపుణులు సిలబస్‌ను రూపొందించారు. దీనికి అవసరమైన మౌలిక సదుపాయాలను కాలేజీలు సమకూర్చుకోవాల్సి ఉంటుంది. అదే సమయంలో ఈ కోర్సులను బోధించేందుకు నిపుణులైన అధ్యాపకులు అవసరం. కొత్త సిలబస్‌లో తరగతి గదిలో బోధనతో సమానంగా నైపుణ్యాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. రెండో ఏడాది నుంచే ప్రాజెక్టు వర్క్ ప్రవేశపెడుతున్నారు. ఏఐ కోర్సు తీసుకునే విద్యార్థులు ఏదైనా ప్రముఖ కంపెనీ తోడ్పాటుతో సొంతంగా సరికొత్త ప్రాజెక్టు చేయాల్సి ఉంటుంది. రెండో ఏడాది మినీ ప్రాజెక్టు, మూడో ఏడాది పెద్ద ప్రాజెక్టును చేపట్టాలి. దీని కోసం కాలేజీలు కొన్ని సంస్థలతో భాగస్వామ్య ఒప్పందం చేసుకోవాల్సి ఉంటుంది. ఇలాంటి ఎంవోయూ ఉన్న కాలేజీలకు మాత్రమే ఈసారి అనుబంధ గుర్తింపు ఇవ్వాలని ఉన్నత విద్యా మండలి భావిస్తున్నట్లు తెలిసింది. ఇంటర్ పరీక్షలు పూర్తయ్యేలోగా ఈ మార్పులపై స్పష్టత వస్తుందని అధికారులు చెబుతున్నారు.

రెండు పార్టీలదే హడావుడి

- పోలింగ్‌ కేంద్రాల సమీపంలో కాంగ్రెస్, బీజేపీ శ్రేణుల ప్రచారం
- ముగిసిన ఎమ్మెల్సీ పోలింగ్‌ ఘట్టం

సుభాష్‌నగర్‌/వేల్పూర్‌/నిజామాబాద్‌ రూరల్‌/మోర్తాడ్‌: ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్‌ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రధానమైన పోలింగ్‌ ఘట్టం గురువారం ప్రశాంతంగా ముగిసింది. ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న బీజేపీ, కాంగ్రెస్‌ పార్టీలదే హడావిడి కనిపించింది. ప్రతిపక్ష బీఆర్‌ఎస్‌ పార్టీ అభ్యర్థిని నిలబెట్టకపోవడంతో పోలింగ్‌ కేంద్రాల వద్ద ఎక్కడ చూసిన బీజేపీ, కాంగ్రెస్‌ నాయకులు, కార్యకర్తల ప్రచారమే కనిపించింది. బీఆర్‌ఎస్‌ మద్దతుతో స్వతంత్ర అభ్యర్థి ఇతర స్వతంత్ర అభ్యర్థులు పోటీలో ఉన్న వారు ఎక్కడ కూడా తమ ప్రచార కార్యక్రమాలు నిర్వహించిన ఆనవాలు లేవు. చివరి క్షణం వరకు సామాజిక మాధ్యమాల్లో ప్రధాన పార్టీలతోపాటు స్వతంత్ర అభ్యర్థులు ఎన్నికల ప్రచారం కొనసాగించడం గమనార్హం. అలాగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆఖరి క్షణం వరకు ఓట్ల కోసం నగదు పంపకాలు కొనసాగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రధాన పార్టీ అభ్యర్థి పోలింగ్‌ రోజున కూడా ఒక్కో ఓటుకు రూ.వెయ్యి చొప్పున అందించినట్లు సమాచారం. మరో ప్రధాన పార్టీ డబ్బులకు బదులుగా మందు పార్టీలను ఏర్పాటు చేసినట్లు తెలిసింది. జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన పోలింగ్‌ కేంద్రాల్లో ఓటుహక్కు వినియోగించుకోవడానికి పట్టభద్రులు, ఉపాధ్యాయులు భారీగానే తరలివచ్చారు. ఎన్నికల్లో జిల్లాలోని ప్రధాన పార్టీల నేతలు, ప్రముఖులు సైతం ఓటు హక్కును వినియోగించుకున్నారు. వేల్పూర్‌లో ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్‌ కుంట రమేశ్‌రెడ్డి ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల్లో ఓటు వేశారు. బాల్కొండ నియోజకవర్గంలోని మెండోరా మండలంలో కాంగ్రెస్‌ నియోజకవర్గం ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి, కమ్మర్‌పల్లిలో బీజేపీ నేత మల్లికార్జున్‌రెడ్డి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

వారు ఓటుకు దూరం..

మోర్తాడ్‌(బాల్కొండ): బాల్కొండ మండలం కిసాన్‌నగర్‌కు చెందిన ఈరవత్రి అనిల్‌ ఇంజినీరింగ్‌ పట్టభద్రుడు కాగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోకపోవడం గమనార్హం. బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి సైతం ఇంజినీరింగ్‌ పట్టభద్రుడు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కోసం వేల్పూర్‌ మండలంలో దరఖాస్తు చేసుకున్నారు. కానీ అనివార్య కారణాల వల్ల ఢిల్లీ పర్యటనలో ఉండటంతో ఆయన ఓటు హక్కును వినియోగించుకోలేక పోయారు. కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లికి చెందిన మాజీ స్పీకర్, రాజ్యసభ ఎంపీ సురేష్‌రెడ్డి పీజీ చదివారు. ఆయన కమ్మర్‌పల్లి మండలంలో ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉండగా వ్యక్తిగత కారణాలతో ఓటు హక్కును పొందలేరు. తెలంగాణ ఉద్యమ జేఏసీ వ్యవస్థాపకుడు రాజారాం యాదవ్‌ ఏర్గట్ల మండలం తాళ్లరాంపూర్‌కు చెందిన వారు. ఆయనకు ఏర్గట్ల మండలంలో పట్టభద్రుల ఓటు హక్కు ఉంది. ఆయన కూడా వ్యక్తిగత కారణాలతో ఓటును వినియోగించుకోలేకపోయారు.



పెర్కిట్‌ పోలింగ్‌ కేంద్రం వద్ద పార్టీ నేతలతో ఆర్మూర్‌ నియోజకవర్గ కాంగ్రెస్‌ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి



డొంకేశ్వర్‌లో బీజేపీ నాయకులతో మాట్లాడుతున్న ఆర్మూర్‌ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌ రెడ్డి



బోధన్‌లో బీఎల్‌వోలతో మాట్లాడుతున్న సబ్‌ కలెక్టర్‌ వికాస్‌ మహతో

పోలింగ్‌ సరళిపై రూరల్‌ ఎమ్మెల్యే సంతృప్తి



నగరంలో మాట్లాడుతున్న రూరల్‌ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

నిజామాబాద్‌ రూరల్‌: నగరంలోని ముబారక్‌నగర్‌ ప్రాథమిక ఉన్నత పాఠశాలలోగల పోలింగ్‌బూత్‌లను రూరల్‌ ఎమ్మెల్యే భూపతిరెడ్డి పరిశీలించారు. పోలింగ్‌ సరళిని చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో కాంగ్రెస్‌ గెలుపు ఖాయం అని ధీమా వ్యక్తం చేశారు. మొదటి స్థానంలో కాంగ్రెస్‌ అభ్యర్థి నరేందర్‌ రెడ్డి భారీ మెజార్టీతో గెలుస్తారన్నారు. నాయకులు అగ్గుభోజన్న, బాగిర్తి బాగారెడ్డి, కొర్వ నర్సయ్య, కుమార్‌రెడ్డి, మోహన్, లింగం, కొర్వ రాజేంద్రప్రసాద్, పైస ఎల్లయ్య, దాసరి శ్రీధర్, తదితరులున్నారు.

బీజేపీ అభ్యర్థుల విజయం తథ్యం..



ఓటర్‌ స్లిప్పులు అందజేస్తున్న అర్బన్‌ ఎమ్మెల్యే ధన్‌పాల్‌ సూర్యనారాయణ

సుభాష్‌నగర్‌: పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటింగ్‌ సరళి, పోలింగ్‌ శాతాన్ని పరిశీలిస్తే బీజేపీ బలపరిచిన అభ్యర్థులు విజయం సాధించడం ఖాయమని నిజామాబాద్‌ అర్బన్‌ ఎమ్మెల్యే ధన్‌పాల్‌ సూర్యనారాయణ ధీమా వ్యక్తంచేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా నగరంలోని ఎస్‌ఎఫ్‌ఎస్, పాలిటెక్నిక్, సీఎస్‌ఐ, నిర్మల హృదయ కళాశాలలోగల పోలింగ్‌ కేంద్రాలను ఆయన సందర్శించారు. ఓటుహక్కు వినియోగించుకోవడానికి వచ్చిన ఉపాధ్యాయులు, పట్టభద్రులకు స్లిప్పులు అందజేశారు. ధన్‌పాల్‌ మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించబోతుందని, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు విజయోత్సవ ర్యాలీలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

ఉపాధ్యాయుల ఓట్లు గల్లంతు

మోర్తాడ్‌(బాల్కొండ): మోర్తాడ్‌ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు దశరథ్‌ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కోసం ఇటీవల దరఖాస్తు చేసుకున్నాడు. కానీ అతను ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన వ్యక్తి కావడంతో ఓటు హక్కు రాలేదు. ఇదే కళాశాలలో మహబూబ్‌నగర్‌ జిల్లాకు చెందిన మరో వ్యక్తి అధ్యాపకుడిగా పని చేస్తున్నారు. అతనికి మాత్రం నివాసం ఆధారంగా నిజామాబాద్‌లో ఓటు హక్కును కల్పించారు. ఇది ఒక్క దశరథ్‌కు ఎదురైన సమస్యనే కాదు. ఎంతో మంది డిగ్రీ, జూనియర్‌ కళాశాలల్లో పని చేస్తున్న పొరుగు జిల్లాల అధ్యాపకులకు ఎదురైన సమస్య. గతంలో ఎక్కడ ఉద్యోగం చేస్తే అక్కడే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునేలా ఎన్నికల కమిషన్‌ అవకాశం కల్పించింది. ఈసారి మాత్రం స్థానికతను సాకుగా చూపింది. ఇలా చూపినా కొందరికి ఓటు హక్కును కల్పించి మరికొందరికి మాత్రం ఓటు హక్కు కల్పించకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



ఓటుహక్కు వినియోగించుకున్న డీసీసీబీ చైర్మన్‌ కుంట రమేశ్‌రెడ్డి



నిజామాబాద్‌ రూరల్‌ ఎమ్మెల్యే భూపతిరెడ్డి



బాల్కొండ నియోజకవర్గ బీజేపీ నేత మల్లికార్జున్‌రెడ్డి



నిజామాబాద్‌ జిల్లాపరిషత్‌ మాజీ చైర్మన్‌ విఠల్‌రావు



బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్‌ ఇన్‌చార్జి సునీల్‌రెడ్డి



ఎస్‌ఎఫ్‌ఎస్‌ స్కూల్‌ వద్ద వివరాలు తెలుసుకుంటున్న ఏడీసీపీ బస్వారెడ్డి



ముబారక్‌నగర్‌ స్కూల్‌ వద్ద పోలీసుల బందోబస్తు

సామాన్యులపై ఎల్‌ఆర్‌ఎస్‌ పిడుగు

- అక్రమ ప్లాట్ల క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించిన రాష్ట్ర ప్రభుత్వం
- మార్కెట్‌ విలువ ప్రకారం చలాన్‌ కట్టాల్సిందంటున్న అధికారులు
- మార్చి నెలాఖరులోపు చేసుకుంటే ఫీజులో 25 శాతం రాయితీ

మోర్తాడ్‌కు చెందిన గంగారాం దాదాపు 19 సంవత్సరాల కింద కొందరు వ్యాపారులు విక్రయించిన 150 గజాల స్థలంను రూ.18వేలకు కొనుగోలు చేశాడు. హాసకొత్తూర్‌కు చెందిన రాజన్న 21ఏళ్ల కింద కమ్మర్‌పల్లిలో వ్యాపారులకు రూ.20వేలు చెల్లించి 120గజాల స్థలం కొనుగోలు చేశాడు. ఇరువురి వద్ద స్థలానికి సంబంధించిన రిజిస్ట్రేషన్‌ కాగితాలు సైతం ఉన్నాయి. కానీ అప్పట్లో రియల్‌ ఎస్టేట్‌ వ్యాపారులు లేఅవుట్‌ చేయకుండానే వ్యవసాయ భూమిని ప్లాట్లుగా మార్చి విక్రయించారు. దీంతో ఇంటి అనుమతి కోసం ఎల్‌ఆర్‌ఎస్‌(లేఅవుట్‌ రెగ్యులైజేషన్‌ స్కీం) కింద ప్రభుత్వానికి భారీ మొత్తంలో ఫైకం చెల్లించాలనే విషయం ఇటీవలే వీరికి తెలిసింది. ఒక్కో ప్లాట్‌కు మార్కెట్‌ ధర ప్రకారం రూ.6వేల నుంచి రూ.20వేల వరకు క్రమబద్ధీకరణ ఫీజును చెల్లించాల్సి ఉంటుంది. ఇది ఒక్క గంగారాం, రాజన్నలపై పడుతున్న ఆర్థిక భారమే కాదు. గ్రామీణ ప్రాంతాల్లో లేఅవుట్‌ చేయని ఇంటి స్థలాలను కొనుగోలు చేసి ఎంతో మందిది ఇదే పరిస్థితి.

మోర్తాడ్‌(బాల్కొండ): లేఅవుట్‌ కాని ఇంటి స్థలాలను, వెంచర్‌లను రెగ్యులరైజ్‌ చేయడానికి కాంగ్రెస్‌ ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్‌ స్కీం ప్రవేశపెట్టింది. దీనిద్వారా ఆదాయం సమకూర్చుకోవడంతో పాటు స్థల యజమానికి ఇంటి నిర్మాణం కోసం అనుమతులు జారీ చేయడానికి ఎలాంటి కొర్రీలు లేకుండా చేయాలని ప్రభుత్వం భావిస్తుందనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది. కానీ సామాన్యులపై మాత్రం ఎల్‌ఆర్‌ఎస్‌ భారం మోపుతోందని పలువురు పేర్కొంటున్నారు. ఎల్‌ఆర్‌ఎస్‌ అమలు ద్వారా లేఅవుట్‌ చేయని ఇంటి స్థలాలు, వెంచర్‌లను క్రమబద్ధీకరణ చేసుకోవాలని ప్రభుత్వం నిర్దేశించింది. ఈమేరకు పంచాయతీ కార్యదర్శులు, నీటిపారుదల శాఖ ఇంజినీర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌లతో ఒక కమిటీని వేశారు. వీరు ఎల్‌ఆర్‌ఎస్‌ కోసం గతంలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి మార్కెట్‌ విలువ ప్రకారం ప్రభుత్వానికి చలాన్‌ జమ చేయాల్సి ఉంటుంది.

అధికార, ప్రతిపక్షాల భిన్న వైఖరి..

ఎల్‌ఆర్‌ఎస్‌పై అధికార, ప్రతిపక్ష పార్టీలు భిన్నవైఖరిని అవలంభిస్తున్నాయి. 2020లో అప్పటి బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్‌ అమలు కేవలం నగర పాలక సంస్థలు, మున్సిపాలిటీలలోనే అమలు చేశారు. ఆదాయ మార్గాలను అన్వేషించి ఎల్‌ఆర్‌ఎస్‌ను గ్రామీణ ప్రాంతాలకు వర్తింపచేయాలని నిర్ణయించింది. అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్‌ ఎల్‌ఆర్‌ఎస్‌ను తీవ్రంగా వ్యతిరేకించింది. ఇప్పుడు అదే పార్టీ అధికారంలోకి వచ్చి ఎల్‌ఆర్‌ఎస్‌ను అమలులోకి తీసుకవచ్చింది. ఇదిలా ఉండగా ప్రతిపక్షంలో ఉన్న బీఆర్‌ఎస్‌ ఉచితంగానే ఎల్‌ఆర్‌ఎస్‌ను అమలు చేయాలని డిమాండ్‌ చేయడం గమనార్హం. అధికారంలో ఉన్నప్పుడు ఒకలా ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకలా మాట్లాడటం రెండు పార్టీలకే చెల్లిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



మోర్తాడ్‌లో ప్లాట్లుగా మార్చిన వ్యవసాయ భూమి

జిల్లాలో 19వేల దరఖాస్తులు..

జిల్లాలోని 530(పునర్విభజనకు ముందు) గ్రామ పంచాయతీల పరిధిలో ఎల్‌ఆర్‌ఎస్‌ కోసం 19వేల దరఖాస్తులు ప్రభుత్వానికి అందాయి. మున్సిపాలిటీలలో అదనంగా మరో 7వేల వరకు దరఖాస్తులు అందినట్లు అంచనా. మార్చి నెలాఖరులోగా క్రమబద్ధీకరణ చేసుకునే వారికి ఫీజులో 25 శాతం రాయితీని కల్పించడానికి ప్రభుత్వం అంగీకరించింది. ఈ లెక్కన ఎల్‌ఆర్‌ఎస్‌ ద్వారా భారీ మొత్తంలో ఆదాయం సమకూర్చుకోవాలనే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నట్లు స్పష్టమైతుంది. లేఅవుట్‌ చేయని ప్లాట్లను కొనుగోలు చేసిన వారిలో మధ్య తరగతి కుటుంబాలకు చెందినవారే అధికంగా ఉన్నారు. వీరంతా ఆర్థిక భారం మోయక తప్పని పరిస్థితి ఏర్పడింది.

గతంలోనే జీవోలు..

ఎల్‌ఆర్‌ఎస్‌ అమలు చేయడానికి గతంలోనే జీవోలు జారీ అయ్యాయి. వాటి ప్రకారమే మార్కెట్‌ ధరను లెక్కించి ఎల్‌ఆర్‌ఎస్‌ ఫీజు ఎంత అనేది తెలుస్తుంది. ఎల్‌ఆర్‌ఎస్‌ కోసం వేసిన కమిటీ సభ్యుల మొబైల్‌ యాప్‌ ద్వారానే మార్కెట్‌ ఫీజు వెల్లడైతుంది. క్రమబద్ధీకరణ చేసుకోవడం వల్ల స్థల యజమానికి ఎంతో మేలు జరుగుతుంది. ఇంటి నిర్మాణాలకు అనుమతి, ఇతర ప్రయోజనాలు ఎల్‌ఆర్‌ఎస్‌తోనే కలుగనున్నాయి. – శ్రీనివాసరావు, జిల్లా పంచాయతీ అధికారి, నిజామాబాద్‌

క్లుప్తంగా

న్యాయవాది మృతిపై సంతాపం



ఆర్మూర్‌టౌన్‌: బోధన్‌ కోర్టు బార్‌ అసోసియేషన్‌ సభ్యుడు న్యాయవాది కె ఎల్లయ్య మృతికి సంతాపంగా ఆర్మూర్‌ బార్‌ అసోసియేషన్‌ సభ్యులు గురువారం రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం న్యాయవాదులు విధులకు హాజరుకాలేదు. కార్యక్రమంలో బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు తెడ్డు నర్సయ్య, న్యాయవాదులు నరేందర్, తాజొద్దీన్, అశోక్, ప్రవీణ్, హరివర్ధన్, సైఫొద్దీన్, శ్యామ్, రాజేందర్, కిరణ్‌ తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్‌లో..

ఖలీల్‌వాడి: జిల్లాకోర్టు ప్రాంగణంలోని బార్‌ సమావేశపు హాల్‌లో గురువారం బోధన్‌ సీనియర్‌ న్యాయవాది కంటే ఎల్లయ్య సంతాప సభ నిర్వహించారు. ఈసందర్భంగా నిజామాబాద్‌ బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు మల్లెపూల జగన్‌ మోహన్‌ గౌడ్‌ మాట్లాడుతూ.. ఎల్లయ్య మృతి చాలా బాధాకరమన్నారు. సంతాప సూచకంగా న్యాయవాదులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. తదనంతరం న్యాయస్థానాల విధులకు దూరంగా ఉండాలని తీర్మానించినట్లు తెలిపారు. బార్‌ కౌన్సిల్‌ సభ్యులు మంథని రాజేందర్‌రెడ్డి, బార్‌ ఉపాధ్యక్షుడు రాజు, కార్యదర్శి దొన్పల్‌ సురేష్, కోశాధికారి దీపక్‌ తదితరులు పాల్గొన్నారు.

మహారాష్ట్రలో జిల్లావాసి!

ఖలీల్‌వాడి: మహారాష్ట్ర రాష్ట్రంలోని సేలు పోలీస్‌స్టేషన్‌ పరిధిలో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడిని విచారించగా నిజామాబాద్‌ నగరంలోని మాలపల్లికి చెందిన ఎస్‌కే కమరోద్దీన్‌గా తెలిపాడన్నారు. మతిస్థిమితం కోల్పోయి తిరుగుతున్నట్లు పోలీసులు గుర్తించారు. వారు గురువారం నిజామాబాద్‌ పోలీసులకు సమాచారం అందించారు. ఎవరైనా అతడి సమాచారం తెలిసిన వారు నిజామాబాద్‌ వన్‌టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

నేడు విద్యుత్‌ సరఫరాలో అంతరాయం

నవీపేట: నవీపేట, రాంపూర్, కమలాపూర్‌ గ్రామాల్లోని సబ్‌స్టేషన్లలో శుక్రవారం మరమ్మతులు చేపడుతున్నందున వీటి పరిధిలోని గ్రామాల్లో విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏడీఈ ప్రశాంత్‌రెడ్డి గురువారం తెలిపారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు విద్యుత్‌ సరఫరా ఉండదని పేర్కొన్నారు. అలాగే మండలంలోని కోస్లీ, యంచ సబ్‌ స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్నందున ఉదయం 11 నుంచి 12 గంటల వరకు విద్యుత్‌ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

వివాహిత అదృశ్యం

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని గ్రీన్‌ సిటీ కాలనీకి చెందిన వనం సంగీత అనే వివాహిత అదృశ్యమైనట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌ రెడ్డి గురువారం తెలిపారు. ఈ నెల 25న బంధువుల ఇంటికని వెళ్లి, తిరిగి రాలేదు. దీంతో ఆమె భర్త పాపయ్య చాలా చోట్ల గాలించినా ఆచూకీ దొరకలేదు. ఈమేరకు పాపయ్య పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

పేకాట ఆడుతున్న ముగ్గురి అరెస్ట్‌

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని మినీ స్టేడియం సమీపంలో పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్ట్‌ చేసినట్లు ఎస్సై అనిల్‌రెడ్డి గురువారం తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడి చేసి పేకాట ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకున్నట్లు ఆయన తెలిపారు. అలాగే వారి వద్ద నుంచి రూ. 2580 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో శివరాత్రి వేడుకలు



నందిపేటలో భక్తులకు బొట్టుపెట్టి ఆశీర్వదిస్తున్న మంగిరాములు మహారాజ్‌



నందిపేటలో రుద్రాక్ష శివలింగానికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి దంపతులు

నందిపేట్‌(ఆర్మూర్‌): మండలంలో శివరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మండల కేంద్రానికి సమీపంలోని కేదారీశ్వర ఆశ్రమం శివనామ స్మరణతో మారుమోగింది. ఉత్సవాలలో భాగంగా ఆశ్రమంతోపాటు గోదావరి ఒడ్డున గల ఉమమహేశ్వర ఆలయం వద్ద జాతర జరిగింది. ఈసందర్భంగా ఆశ్రమ వ్యవస్థాపకుడు మంగిరాములు మహారాజ్‌ దర్శనం కోసం భక్తులు భారీగా తరలి వచ్చారు. వారికి స్వామీజీ బొట్టు పెట్టి ఆశీర్వదించారు. కేదారీశ్వర ఆశ్రమంలో ఆర్మూర్‌ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మంగిరాములు మహారాజ్‌ ఆశీర్వాదం తీసుకున్నారు. అలాగే మండల కేంద్రంలోని నందికేశ్వర ఆలయంలో గ్రామకమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. మండలంలోని ఉమ్మెడ శివారులోని ఉమమహేశ్వర ఆలయంలో ధ్వజస్తంభ దీపారాధన చేశారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ఘనంగా ఏకచక్రేశ్వర స్వామి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న మహిళలు, చిన్నారులు

బోధన్‌రూరల్‌: పట్టణంలోని ఏకచక్రేశ్వర శివాలయంలో మహా శివరాత్రి వేడుకలను దేవాదాయ ధర్మాదాయ శాఖ, ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో స్వామివారి ఉత్సవ మూర్తులకు కల్యాణం నిర్వహించారు. అనంతరం గర్భాలయంలోని శివలింగానికి ప్రత్యేకాభిషేకం, నిశిపూజ (లింగోద్భవం) కార్యక్రమం నిర్వహించారు. గురువారం ఆలయ ప్రాంగణంలో స్వామివారికి ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించి రథోత్సవం చేపట్టారు. రథానికి మహిళలు, భక్తులు ప్రత్యేక హారతులు, పూజలతో స్వాగతం పలికారు. పట్టణాభివృద్ధి కమిటీ చైర్మన్‌ గంగాధర్‌ పట్వారి, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు హరికాంత్‌చారి, లక్ష్మణ్, లింగం, భూమేష్, కవిత, సంజీవ్, నాగేష్, ఈవో రాములు, అర్చకులు గణేష్‌ మహరాజ్, మహేష్, శివ కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.



రథోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు



దాండియా ఆడుతున్న మహిళలు

క్రైం కార్నర్‌

అత్తింటి వేధింపులకు వివాహిత బలి



రజిత (ఫైల్‌)

బోధన్‌టౌన్‌(బోధన్‌): పట్టణంలో అదనపు కట్నం కోసం అత్తింటి వారు వేధింపులకు గురిచేయగా, ఓ వివాహిత ఆత్మహత్యకు యత్నించింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. పట్టణంలోని ధ్యాకం గల్లీకి చెందిన జమేదార్‌ సాయిలుకు రెంజల్‌ మండలం బాగెపల్లి గ్రామానికి చెందిన రజితతో 15ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి సాహితి, శ్రీనిధి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఇటీవల భర్త సాయిలు, అత్తలు లక్ష్మి, నాగమణి, బావ నగేష్, మరిది రాజ అదనపు కట్నం కోసం రజితను వేధించారు. దీంతో ఆమె తండ్రి సాయిలు పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టి సముదాయించారు. కానీ వారి ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాకపోవడంతోపాటు మళ్లీ అదనపు కట్నం కోసం వేధించగా రజిత ఈనెల 24న రాత్రి ఇంట్లో ఒంటిపై పెట్రోల్‌ పోసుకొని ఆత్మహత్యకు యత్నించింది. మంటలు చెలరేగడంతో భర్త, స్థానికులు వెంటనే ఆమెను బోధన్‌లోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించి, చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో ఆమె గురువారం మృతి చెందింది. మృతురాలి తండ్రి సాయిలు ఫిర్యాదు మేరకు అత్తింటి వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ వెంకట నారాయణ వెల్లడించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ఖలీల్‌వాడి: నగరంలోని మూడోటౌన్‌ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై హరిబాబు గురువారం తెలిపారు. మృతుడు రెండు రోజుల క్రితం చనిపోయి ఉంటాడని, వయస్సు సుమారు 40 ఏళ్ల నుంచి 45 ఏళ్ల మధ్య ఉంటుందని అన్నారు. ఒంటిపై బూడిద కలర్‌ షర్టు, బూడిద కలర్‌ పాయింట్‌ ధరించి ఉన్నాడని. భిక్షాటన చేసే వ్యక్తిగా అనుమానిస్తున్నామన్నారు.

ధర్పల్లి మండల కేంద్రంలో..

ధర్పల్లి: మండల కేంద్రంలోని ఊర చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభించిందని ఎస్సై రామకృష్ణ గురువారం తెలిపారు. మృతుడు 35 ఏళ్ల నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు ఉంటాడన్నారు. తెలుపు రంగు బ్లాక్‌ గీతల చొక్కా, వైట్‌ రంగు పాయింట్‌ ధరించి ఉన్నాడని తెలిపారు. కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి చెరువులో పడి మృతిచెందినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. వ్యక్తికి సంబంధించిన వివరాల కోసం ధర్పల్లి పోలీస్‌ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్సై తెలిపారు.